క్లుప్తంగా

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



రెంటచింతల: పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే వ్యాధులకు దూరంగా ఉండవచ్చునని ఎంఎల్‌హెచ్‌పీ(మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్) మౌనిక చెప్పారు. బుధవారం స్థానిక ఎస్సీ బాలుర సంక్షేమ వసతి గృహంలో ఆమె విద్యార్థులకు ఆరోగ్య జాగ్రత్తలు వివరించారు. విద్యార్థులు ఉదయం నిద్ర లేచిన తరువాత, రాత్రి నిద్రించే ముందు తప్పనిసరిగా దంతాలను శుభ్రం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సీ సంక్షేమ బాలుర వసతి గృహం వార్డెన్ నూరెల్లా బేగ్, ఆశాలు, సిబ్బంది బాదం రామిరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

బ్రహ్మకుమారీస్ సేవలు ప్రశంసనీయం



రెంటచింతల: వ్యసనాలకు బానిసలైన వారిలో మార్పు తీసుకు రావడానికి బ్రహ్మకుమారీస్ సంస్థ చేస్తున్న సేవలు ప్రశంసనీయమని తహసీల్దార్ మూఢావత్ అర్జున్‌నాయక్ అన్నారు. బుధవారం స్థానిక మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి బ్రహ్మ కుమారీస్ సంస్థ ఏర్పాటు చేసిన వాహనాన్ని ఆయన ఎంపీడీఓ కె.సరోజినిదేవి, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ నర్రా కృష్ణారెడ్డిలతో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ వాహనం ద్వారా ఆడియో, వీడియోలతో ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు యత్నించడం అభినందనీయమన్నారు. బ్రహ్మకుమారి సిస్టర్ అర్చన మాట్లాడుతూ ధ్యానం వల్ల మనిషి దృఢంగా ఉంటారని వివరించారు. కార్యక్రమంలో వి.ప్రదీప్‌కుమార్‌రెడ్డి, డెప్యూటీ తహసీల్దార్ పిన్నం బ్రహ్మయ్య, తెనాలి రామకృష్ణ, నాళం సత్యనారాయణ, కొక్కెండ్ల బ్రహ్మం, గుండా రామ్మూర్తి పాల్గొన్నారు.

ఉపాధితో కూలీలకు భరోసా



రెంటచింతల: గ్రామీణ ప్రాంతాలలోని కూలీలకు పనులు లేని సమయంలో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా భరోసా కల్పించాలని ఏపీఓ జయచంద్రకుమార్ అన్నారు. బుధవారం మండలంలోని వివిధ గ్రామాలలో ఉపాధిహామీ పథకం ద్వారా చేపట్టిన పంట కాలువ పూడిక తీత పనులు, మస్టర్ల నమోదును పరిశీలించి ఫీల్డు అసిస్టెంట్లకు సూచనలు చేశారు. అనంతరం స్థానిక కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. 2024–25లో ఇప్పటి వరకు రూ. 8 కోట్ల విలువైన 219 పనులను గ్రామాలలో గుర్తించామన్నారు. గ్రామాలలో ప్రస్తుతం మంచినీటి ఎద్దడిని దృష్టిలో పెట్టుకుని 70 నీటి కుంటలలో పూడికతీత పనులకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చామన్నారు. పాలువాయి గ్రామంలో ఉపాధి పనులు చేపట్టలేదని, మిగిలిన 10 గ్రామాలలో మొత్తం 750 మంది కూలీలు ఉపాధి పనులకు వస్తున్నట్లు వెల్లడించారు. టెక్నికల్ అసిస్టెంట్ వి. విజయకుమారి, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

కొరియా బృందం పరిశీలన



మాచర్ల రూరల్: రాయవరం, కొత్తపల్లి, తాళ్ళపల్లి గ్రామాలలో ఏపీఐఐసీకి కేటాయించిన భూములను కొరియా దేశ కంపెనీ ప్రతినిధులు బుధవారం పరిశీలించారు. రాయవరం గ్రామంలో 151 ఎకరాలు, కొత్తపల్లిలో 450 ఎకరాలలోని భూములలో లెదర్ పార్కు ఏర్పాటుకు ఇండస్ట్రియల్ డెప్యూటీ డైరెక్టర్ సుధాకర్, గురజాల ఆర్డీఓ వి.మురళీ కృష్ణ, తహసీల్దార్ బి.కిరణ్‌కుమార్ నేతృత్వంలో భూములను నిశితంగా పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్ఐ అనిల్ కుమార్, సర్వేయర్ వై.రఘుపతి, వీఆర్వోలు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలి

ఎంపీడీవో జీవీ సత్యనారాయణ

రాజుపాలెం: ఈ నెల 27న కృష్ణా గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగనున్నందున పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో జీవీ సత్యనారాయణ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శుల సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలక్షన్ అయ్యే వరకు గ్రామాలలో రాజకీయ నాయకుల బ్యానర్స్ ఏర్పాటు చేయకుండా నిరోధించాలని తెలిపారు. రాజుపాలెం మండల పరిషత్ పాఠశాలలో పోలింగ్ బూత్ ఉన్నందున విద్యుత్‌తో పాటు అన్ని సౌకర్యాలు ఉండే విధంగా చూడాలని పంచాయతీ కార్యదర్శి సురేష్‌కు సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆరుగాలం ఏడుపంట!

- వేళాపాళా లేని విద్యుత్ కోతలతో రైతాంగం సతమతం
- ఏడు సబ్‌స్టేషన్ల పరిధిలోనూ ఇదే దుస్థితి
- చివరి దశలో ఉన్న పంటలను కాపాడాలని రైతుల వేడుకోలు
- కూటమి ప్రభుత్వం వాగ్దానం నిలబెట్టుకోవాలని డిమాండ్



ఎండిపోతున్న మొక్కజొన్న పంట

దుర్గి: పూర్తిగా వర్షాలు, బోరు బావులపై ఆధారపడి పంటలు పండించే పల్నాటి ప్రాంత రైతాంగానికి కరెంట్ కష్టాలు కన్నీరు తెప్పిస్తున్నాయి. అసలే ఈ సీజన్‌లో పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక సతమతవుతున్న కర్షకులు మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా విద్యుత్ కోతలతో తల్లడిల్లుతున్నారు. కళ్లెదుటే పంటలు ఎండిపోతుండటంతో దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

పంటలు ఎండుముఖం

దుర్గి మండలంలో బోరు బావులపై ఆధారపడి మిరప, కంది, మొక్కజొన్న పంటలు పండిస్తున్నారు. ఏ సమయంలో కరెంట్ వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలీక రైతులు సతమతమవుతున్నారు. నీటి తడులు అందించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో కొన్నిచోట్ల పంటలు ఎండుముఖం పడుతున్నాయి. మండలంలోని ఏడు సబ్‌స్టేషన్ల పరిధిలోనూ ఇదే దుస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు పగటిపూట ఉచితంగా 9 గంటలు నిరంతరాయంగా విద్యుత్ ఇస్తామని చెప్పిన మాటలు నీటి మూటలుగానే మిగిలాయి. దీనిపై విద్యుత్ అధికారులను ప్రశ్నిస్తున్నా.. సరైన సమాధానం రావడం లేదు. ఏదోఒక సాకు చెబుతున్నారు. ప్రస్తుతం ఎండలు బాగా కాస్తున్నందున పంటలకు నీరు అవసరం ఎక్కువగా ఉంటుందని రైతులు చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు జోక్యం చేసుకొని రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరుతున్నారు.

ఆత్మకూరు సబ్ స్టేషన్ మంజూరైనా అతీగతీ లేదు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఆత్మకూరుకు విద్యుత్ సబ్ స్టేషన్ మంజూరు చేయించారు. అయితే ఇప్పటికీ సంబంధిత దస్త్రం ముందుకు కదలకపోవటంతో పనులు ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయి.

పగటిపూట 9 గంటలు విద్యుత్ ఇవ్వాలి



కూటమి నేతలు ఎన్నికల సమయంలో పగటి పూట నిరంతరాయంగా 9 గంటలపాటు ఉచిత విద్యుత్ అందిస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక ఆ హామీని విస్మరించారు. తరచూ కోతలు విధిస్తుండడంతో పంటలు ఎండిపోతున్నాయి. రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో ఎన్ని ఆటంకాలు ఉన్నా నిరంతరాయంగా పగటి పూట విద్యుత్ ఇచ్చి రైతు సంక్షేమానికి కృషి చేశాం.

–ఉన్నం వెంకటేశ్వర్లు (పెద్దబ్బాయ్)
వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్

వేళాపాళా లేకుండా విద్యుత్ కోతలు



ప్రస్తుతం పంటలు చివరి దశలో ఉన్నాయి. వీటిని కాపాడుకోవాలి. వేళాపాళా లేని విద్యుత్ కోతల వల్ల పంటలు ఎండిపోతున్నాయి. ఫలితంగా రైతులకు కష్టాలు తప్పడం లేదు. కనీసం ఈ రెండు నెలలపాటైనా సక్రమంగా విద్యుత్ సరఫరా చేసి పంటలను కాపాడాలని కోరుతున్నాం.

– యకటీల నాగేశ్వరరావు, రైతు

క్యాలెండర్ ఆవిష్కరణ



గురజాల : పట్టణంలోని కోర్టు భవనాల్లో బుధవారం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. న్యాయవాది కలివెల ప్రభుదాసు ఆధ్వర్యంలో క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో చల్లా రామిరెడ్డి, కె.హరిసత్యనారాయణ, కత్తి చలమరాజు, కర్రా చిన కోటేశ్వరరావు, ఎస్ శ్యామలదేవి, బిజ్జాన సుందరి, ప్రసాదరావు, సైదా, ఝాన్సీ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సొమ్ము గల్లంతుపై ఫిర్యాదు

కారెంపూడి: సొమ్ము మాయం నేపథ్యంలో వెలుగు యానిమేటర్ జ్యోతిపై కారెంపూడి ఎస్సీ కాలనీకి చెందిన భారతరత్న డ్వాక్రా గ్రూపు సభ్యులు బుధవారం వెలుగు ఏపీఓ శివకుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన ప్రాథమిక పరిశీలనలో గ్రూపు నుంచి బ్యాంకులో జమ కావాల్సిన రూ.5 లక్షల వరకు గల్లంతైనట్లు గుర్తించారు. ఈ విషయమై వివరణ కోరినా యానిమేటర్ స్పందించ లేదని ఏపీఓ పేర్కొన్నారు. అనంతరం ఈ విషయమై గ్రూపు సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాము బ్యాంకులో జమ చేయడానికి ప్రతి నెలా డబ్బు చెల్లించామని, అయితే యానిమేటర్ ఆ డబ్బును చెల్లించలేదని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు.

కల్యాణం.. కమనీయం



శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి



పీటలపై కూర్చుని వివాహ వేడుక నిర్వహిస్తున్న పుణ్య దంపతులు

పిడుగురాళ్ల: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వెనుక ఉన్న వేంటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వస్తిశ్రీ చాంద్రమానేన క్రోధి నామ సంవత్సర మాఘ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకొని స్వామి వార్షిక కల్యాణ మహోత్సవం జరిపించారు. పుణ్య దంపతులు పీటలపై కూర్చొని కల్యాణ వేడుక చేశారు. ఈ వేడుకను తిలకించేందుకు భక్తులు విశేషంగా హాజరయ్యారు. అర్చకులు ఎన్.హనుమాన్ దీక్షితులు, రంఘనాథ సింగరాచార్యులు, టీడీపీ ప్రసాద్, దేవస్థాన అర్చకుల బృందం చేతుల మీదుగా కార్యక్రమం జరిగింది. అనంతరం మహా అన్నదానం చేశారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలతో పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరై స్వామివార్లకు బంగారు నగలను బహూకరించారు.

ఈ నెల 15లోగా ఈ క్రాప్ నమోదు చేసుకోవాలి



రైతులకు సూచనలిస్తున్న మండల వ్యవసాయాధికారి దేవదాసు

నకరికల్లు: ఈ నెల 15వ తేదీలోగా ఈ క్రాప్ బుకింగ్ నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు రైతులకు సూచించారు. మండలంలోని దేచవరం, చల్లగుండ్ల అడ్డరోడ్డు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీలో సాగు చేస్తున్న అన్నిరకాల పంటలకు ఫార్మర్ ఈ కేవైసీ నమోదు చేసుకుంటేనే సంక్షేమ పథకాలు రైతులకు వర్తిస్తాయని అన్నారు. మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో ఫార్మర్ రిజిస్టర్ ఐడీ నంబర్ నమోదు చేసుకున్న ప్రతి రైతుకు జారీ చేయబడుతుందన్నారు. రబీ సాగుదారు రైతులు ఆధార్ కార్డుతో పాటు పట్టాదారు పాస్‌పుస్తకం నకలు, ఆధార్ లింక్ చేయబడిన ఫోన్ నంబర్‌తో రైతు సేవా కేంద్రాలకు వెళ్లి ఈ క్రాప్ నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఈఓ కె.రవిబాబు, వ్యవసాయ విస్తరణాధికారి కె.దిలీప్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.


రైతు రిజిస్ట్రీ నమోదు చేసుకోవాలి

మాదల(ముప్పాళ్ళ): రైతులందరూ రైతు రిజిస్ట్రీ చేయించుకోవాలని, నమోదు చేసుకోకుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు, రాయితీలు వర్తించవని జిల్లా రీసోర్స్ సెంటర్ శాస్త్రవేత్త డా.నగేష్ చెప్పారు. మండలంలోని మాదల, ఇరుకుపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మొక్కజొన్న, శనగ పంటలను బుధవారం పరిశీలించారు. మొక్కజొన్న, శనగ పంటలు సాగు చేసిన రైతులు తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులు తమ ఉత్పత్తులను అమ్ముకోవచ్చని తెలిపారు. శనగ పంటలో ఎండు తెగులు నివారణకు ట్రైకోడెర్మావిరిడి వాడాలని సూచించారు. వరిలో ఆకులు లేత పసుపు రంగులోకి వస్తున్నాయని, నివారణకు జింక్ స్ప్రే చేయాలని సూచించారు. మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ, డీఆర్సీ ఏఓ ప్రవీణ్, వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



శనగ పంటను పరిశీలించి సూచనలు చేస్తున్న శాస్త్రవేత్త నగేష్, ప్రవీణ్, అరుణ

వైభవంగా శ్రీలక్ష్మీతిరుపతమ్మ, గోపయ్యల గ్రామోత్సవం



శ్రీలక్ష్మీ తిరుపతమ్మ, గోపయ్య స్వామి

సత్తెనపల్లి: పట్టణంలోని నరసరావుపేటరోడ్‌లో వేంచేసి ఉన్న శ్రీలక్ష్మీ తిరుపతమ్మ, గోపయ్య స్వామి వారి 31వ వార్షిక కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మీ తిరుపతమ్మ, కాకాని గోపయ్య స్వామి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి బుధవారం గ్రామోత్సవం నిర్వహించారు. మేళతాళాలు, కనక తప్పెట్లు, మహిళల కోలాటం నడుమ గ్రామోత్సవం సాగింది. అనంతరం జలబిందెల కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారి కృపకు పాత్రులయ్యారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా అమ్మవారి సేవకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆప్కాస్‌ను రద్దు చేస్తే ఉద్యమిస్తాం



మాట్లాడుతున్న ఏవీ నాగేశ్వరరావు

వినుకొండ(నూజెండ్ల): కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, ఉద్యోగులకు, కార్మికులకు, కర్షకులకు, అన్ని వర్గాల ప్రజలకు ప్రయోజనాలు చేకూరుస్తామని బూటకపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అన్నివర్గాలకు నష్టం కలిగించేలా తీసుకుంటున్న నిర్ణయాలను పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ టీచర్స్ వర్కర్స్ జేఏసీ చైర్మన్ ఏవీ నాగేశ్వరరావు అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా పీడీఎఫ్ అభ్యర్థుల గెలుపును కాంక్షిస్తూ ప్రచార నిమిత్తం పల్నాడు జిల్లా వినుకొండ పట్టణంలో స్తూపం సెంటర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆప్కాస్‌ను రద్దు చేసి 4శాతం మార్జిన్ ఇచ్చేలా ప్రైవేటు కాంట్రాక్టర్ల ద్వారా ఉద్యోగులను నియమించేలా తీసుకున్న నిర్ణయాన్ని తమ జేఏసీ ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆప్కాస్‌ను రద్దు చేస్తే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని అన్నారు.పీడీఎం ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావును మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరా రు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ముజఫర్ అహ్మద్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయనాయక్, యూటీఎఫ్ మాజీ జిల్లా కార్యదర్శి కట్టా కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పారా లీగల్ వలంటీర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

మాచర్ల : మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పారా లీగల్ వలంటీర్‌గా విధులు నిర్వహించడానికి అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్టు మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ మాచర్ల జూనియర్ సివిల్ జడ్జి శ్రీరాం శ్రీనివాస కళ్యాణ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వలంటీర్లు ఎటువంటి ఆదాయం ఆశించరాదని స్పష్టం చేశారు. ఎస్ఎస్‌సీ ఉత్తీర్ణులై ఉండాలని, ఉపాధ్యాయులు, విశ్రాంత ఉద్యోగులు, విద్యార్థులు, అంగన్‌వాడీ కార్యకర్తలు దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు.

కూటమి విజయంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం


సత్తెనపల్లి: గత ఎన్నికల్లో కూటమి విజయం సాధించడంలో ఉపాధ్యాయుల పాత్ర చాలా కీలకమని, ఉమ్మడి కృష్ణ, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు ఉపాధ్యాయులు మద్దతు ఇవ్వాలని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ కోరారు. ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించాలని కోరుతూ బుధవారం పట్టణంలో శ్రీ రాఘవేంద్ర బాలకుటీర్, బాబా గురుదేవ్ డిగ్రీ కళాశాల ఉపాధ్యాయులు, అధ్యాపకులతో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పని చేస్తామన్నారు. ఉపాధ్యాయులు, ప్రతిభావంతులు, మేధావులు కూటమి అభ్యర్థికి ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. శ్రీ రాఘవేంద్ర బాలకుటీర్ బాధ్యుడు వెలుగూరి సుబ్బరాయుడు, ప్రిన్సిపాల్ ఎం.గీతాంజలి, శ్రీవాసవి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సాంబశివరావు, బాబా గురుదేవ్ డిగ్రీ, పీజీ కళాశాల డైరెక్టర్ మట్టా సుబ్రమణ్యేశ్వర రావు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, నాయకులు ఉన్నారు.

శ్రీవారికి మాఘ పౌర్ణమి ప్రత్యేక పూజలు



సత్తెనపల్లి: శ్రీమహావిష్ణువుకు ప్రియమైన మాఘ మాసంలో పౌర్ణమి సందర్భంగా పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులోని అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో బుధవారం ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం స్నపన తిరుమంజనం, శ్రీవారికి ప్రత్యేక అలంకారం, విశేష హారతులు, అష్టోత్తర శతనామావళి కైంకర్యాలు విశేషంగా నిర్వహించారు. అలాగే వైభవోపేతంగా శ్రీవారికి గరుడ వాహన సేవ నిర్వహించారు. రాత్రికి గరుడ ముద్ద ప్రసాద వితరణ చేపట్టారు. అనంతరం ఏకాంత సేవ, తీర్థ ప్రసాద గోష్టి కార్యక్రమం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై శ్రీవారి ఆశీస్సులు పొందారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మొదటి ప్రాధాన్యత ఓటు లక్ష్మణరావుకు వేసి గెలిపించాలి



సత్తెనపల్లి: ఉమ్మడి కృష్ణ, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కేఎస్ లక్ష్మణరావుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని మహిళా సంఘం జిల్లా కార్యదర్శి గుంటుపల్లి రజిని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో లక్ష్మణరావు గెలుపును కాంక్షిస్తూ బుధవారం పట్టణంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గుంటుపల్లి రజని మాట్లాడుతూ పట్టభద్రులు, మేధావులు ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకొని ప్రజా సమస్యలపై నిత్యం పోరాడే కేఎస్ లక్ష్మణరావు గెలుపులో భాగస్వాములు కావాలన్నారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు గెలుపును కాంక్షిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మహిళా సంఘం పట్టణ కమిటీ సభ్యురాలు ధరణికోట విమల, డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి జడ రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

నైతిక, ఆధ్యాత్మిక విలువలు అలవర్చుకోవాలి



మాచర్ల రూరల్: విద్యార్థి దశలోనే నైతిక, ఆధ్యాత్మిక విలువలపై అవగాహన కలిగి ఉండాలని శ్రీ రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి సితికంఠ నందజీ మహరాజ్ కోరారు. బుధవారం మండలంలోని న్యూటన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో నైతిక, ఆధ్యాత్మిక విలువలపై నిర్వహించిన మోటివేషన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు ఆధ్యాత్మిక విషయాలు వివరించారు. న్యూటన్స్ కాలేజి కరస్పాండెంట్ జున్నా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ విజయం సాధించాలంటే ముందు ఆత్మవిశ్వాసం ముఖ్యమన్నారు. రామకృష్ణ సేవా సమితి అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డి మాట్లాడుతూ నిజాయితీతో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జగదీష్‌రెడ్డి, ప్రొఫెసర్ రఘునాథబాబు, రిటైర్డ్ హెచ్‌ఎం ముత్యాల పాపిరెడ్డి, సంగీత ఉపాధ్యాయులు షేక్ చిన లాలు సాహెబ్, గంగ్రకోట శివ సుందర ప్రసాద్, రామాంజి, అధ్యాపకులు పాల్గొన్నారు.

వాసవీ అమ్మవారికి లక్ష తులసీ దళాలతో పూజలు



సత్తెనపల్లి: మాఘ పౌర్ణమి, లలితా మహా త్రిపుర సుందరి జయంతి పర్వదినాలను పురస్కరించుకొని పట్టణంలోని మాచర్ల రోడ్డులో గల వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని లక్ష తులసీ దళాలతో అలంకరించి పూజలు నిర్వహించారు. గత 15 సంవత్సరాలుగా అమ్మవారికి ప్రత్యేక అలంకరణకు సహకరిస్తున్న దాతలు కీర్తిశేషులు కొప్పురావూరి అప్పారావు ధర్మపత్ని వెంకటలక్ష్మి కుసుమకుమారిల కుమారులు వెంకట నాగసత్య కిషోర్‌బాబు, వెంకట నాగ బాల ఆంజనేయ ప్రసాద్ ఆదిత్యల కుటుంబాలకు అమ్మవారి అనుగ్రహం ఎల్లవేళలా కలగాలని కాంక్షించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా దేవస్థానం ప్రెసిడెంట్ బొచ్చు వెంకటేశ్వర్లు, గోశాల ప్రెసిడెంట్ పెంద్యాల కాశి మల్లేశ్వరరావులు పర్యవేక్షించారు.


డాక్టర్ రమాదేవికి స్టార్ గోల్డెన్ అవార్డు ప్రదానం



అవార్డు, సత్కారం అందుకుంటున్న డాక్టర్ సరికొండ రమాదేవి

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన రిటైర్డ్ ప్రధానోపాధ్యాయురాలు, రచయిత్రి డాక్టర్ సరికొండ రమాదేవికి స్టార్ గోల్డెన్ అవార్డు, ఘంటసాల జాతీయ స్ఫూర్తి సేవా అవార్డును ప్రదానం చేశారు. సాహిత్యం, సేవా దృక్పథాన్ని దృష్టిలో పెట్టుకొని లిటిల్ చాంప్స్ అకాడమీ ఆఫ్ ఇండియా–2025 ఘంటసాల జయంతి సందర్భంగా ఒంగోలు ఎన్టీఆర్ కళాక్షేత్రంలో ఈ నెల 11న అవార్డులు అందించారు. ఇందులో భాగంగా రచయిత్రి డాక్టర్ సరికొండ రమాదేవికి అవార్డుతోపాటు మెమెంటో, సర్టిఫికెట్, గోల్డ్ కప్పు అందించి సత్కరించారు. ఈ సందర్భంగా పట్టణంలోని వివిధ సంస్థల అధినేతలు, కార్యదర్శులు, పుర ప్రముఖులు డాక్టర్ సరికొండ రమాదేవిని బుధవారం ప్రత్యేకంగా అభినందించారు.

లెదర్‌పార్క్ ఏర్పాటుకు స్థల పరిశీలన



భూములను పరిశీలిస్తున్న కొరియా దేశ ప్రతినిధులు

నకరికల్లు: మండలంలోని నర్సింగపాడు గ్రామ పరిధిలోని బీబీసీ (బఫెలో బ్రీడింగ్ సెంటర్) భూముల్లో లెదర్ పార్క్ నిర్మాణానికి గాను కొరియా దేశ ప్రతినిధులు బుధవారం భూములను పరిశీలించారు. బీబీసీ పరిధిలోని 75 ఎకరాల విస్తీర్ణంలో భూమిని పరిశీలించి వివరాలు సేకరించారు. ఏపీ ఈడీబీ ప్రతినిధి కె.రంజిత్ ఆధ్వర్యంలో కొరియా దేశం నుంచి ఔసాంగ్ ఎంటర్ ప్రైజస్ సీఈఓ బాబ్, కీ, రెయిన్, సత్తెనపల్లి ఆర్డీఓ రమణాకాంత్‌రెడ్డి, తహసీల్దార్ కె.పుల్లారావుల బృందం పర్యటించారు. భూములకు సంబంధించిన మ్యాప్‌ను పరిశీలించారు. లెదర్ పార్క్ ఏర్పాటుకు కావలసిన మౌలిక వసతులు, అనుకూల, ప్రతికూలతలపై చర్చలు చేశారు. వారి వెంట పలువురు అధికారులు ఉన్నారు.

గార్లపాటి దాసుకు సన్మానం

క్రోసూరు: బంగారునంది, అబ్దుల్‌కలాం లైఫ్‌టైం అచీవ్‌మెంట్ పురస్కార గ్రహీత గార్లపాటి దాసును బుధవారం వైఎస్సార్‌సీపీ నాయకులు పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. స్థానిక మాజీ యార్డు చైర్మన్ డాక్టర్ ఎం.షరీఫ్ ఇంట్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు డాక్టర్ మహ్మద్ షరీఫ్ మాట్లాడుతూ దాసు ఎస్సీ, ఎస్టీల హక్కుల పరిరక్షణ కొరకు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. ఈ సన్మాన కార్యక్రమంలో తిప్పిరెడ్డి అప్పిరెడ్డి, తెల్లమేకల అంజి యాదవ్, చిలకా ప్రభాకర్, గార్లపాటి జీవరత్నం, చిలకా నాగరాజు పాల్గొన్నారు.